సాక్షి మంచిర్యాల

మంగళవారం ♦ 14 ♦ మార్చి ♦ 2023

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /21.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి చర్యలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మందమర్రి మండలం క్యాతనపల్లి శివారులోని సీలింగ్ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని జైపూర్ మండలం ఇందారానికి చెందిన సందీప్ ఫిర్యాదు చేశారు. మంచిర్యాల కాలేజీ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వృద్ధాప్యంలో ఉన్న తన పోషణ బాధ్యత చూడకుండా కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, పోషణ కోసం కొంత సొమ్ము ఇప్పించాలని తీగలపాడ్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పూదరి చంద్రయ్య అర్జీ సమర్పించారు. మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వే జాబితా రద్దు చేసి రీ సర్వే చేయాలని వినతిపత్రం సమర్పించారు. భూ ఆక్రమణలు, అక్రమ పట్టాలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పించాలని పలువురు కోరారు.

15న మంత్రి హరీష్‌రావు రాక

మందమర్రిరూరల్: ఈ నెల 15న చెన్నూర్ నియోజకవర్గంలో మంత్రి హరీష్‌రావు పర్యటించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్ మండలం ఇందారంలో అభివృద్ధి పనులు, జైపూర్, భీమారం మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్, జోడువాగుల(వై జంక్షన్) వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అర్బన్ ఎకో పార్క్, చెన్నూర్‌లో వంద పడకల ఆసుపత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. బస్‌డిపో, సీహెచ్‌సీ సెంటర్‌లో అదనపు పనులు, మినీ స్టేడియం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అభయహస్తం నిధుల విడుదల, చెక్కుల పంపిణీ, తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

వేంపల్లికి ఇసుక రీచ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని గోదావరి తీరం వద్ద ఇసుక రీచ్‌ను గుర్తించి ఆమోదిస్తూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ సంయుక్త సంచాలకుడు(ఏడీ) బాలు తెలిపారు. రెండు విడతలుగా వేంపల్లి గోదావరి తీరాన్ని సందర్శించి అధికారిక ఇసుక రీచ్ కోసం అనువైన ప్రాంతాన్ని గుర్తించి కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు. స్థానిక గృహ అవసరాలకు ఇసుక కొరతను నివారించేలా వేంపల్లిలోని గోదావరి తీరాన ఇసుక రీచ్ అన్ని ప్రాంతాలకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సంతోష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేంపల్లి ఇసుక రీచ్‌కు ఆమోదం తెలిపారని అన్నారు. జిల్లాలోని ట్రాక్టర్ యజమానుల విన్నపం మేరకు ప్రతీ కిలోమీటర్‌కు రూ.5 చొప్పున అదనంగా ట్రాక్టర్ చార్జీలు పెంచుకునేలా కూడా ఆమోదం లభించిందని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల్లో ఇసుక రీచ్ ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇక ఇసుక రీచ్ అమోదం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, డీపీఓ ఫణీందర్‌రావు, ఇరిగేషన్ డీఈ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు, గ్రౌండ్ వాటర్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

సీపీఆర్ పద్ధతిలో గుండెపోటు బాధితులను కాపాడవచ్చు



సీపీఆర్ ప్రక్రియను వివరిస్తున్న డీఎంహెచ్‌వో

పాతమంచిర్యాల: సీపీఆర్ పద్ధతి ద్వారా గుండెపోటు బాధితులకు సత్వర చికిత్స అందించి ప్రాణాలు కాపాడవచ్చని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌తో కలిసి సీపీఆర్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పద్ధతిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలోని ఐదుగురు సభ్యులకు శిక్షణ అందించామని, ఈ నెల 16న జిల్లాలోని ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇస్తామని, అనంతరం అందరికీ శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశ్వవేదికపై మన భీమ్..



- ఆంగ్లేయులపై పోరాడిన అడవి బిడ్డ
- ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఆకట్టుకున్న పాట
- 'నాటు.. నాటు'కు ఆస్కార్..
- ప్రపంచవ్యాప్తంగా మన వీరుడిపై చర్చ



కుమురం భీమ్ కుటుంబసభ్యులు

నిర్మల్:

"భీమా..
నినుగన్న నేల తల్లి
ఊపిరిబోసిన సెట్టూసేమా
పేరు బెట్టిన గోండు జాతి
నీతో మాట్లాడుతున్రు
ఇనవడుతుందా..!"

అవ్.. భీమా..! ఇవ్వాళ మన అడవుల జిల్లానే కాదు, ఆదివాసీ బిడ్డలే కాదు, యావత్ ప్రపంచమే నువ్వంటే ఎవరో తెలుసుకుంటుంది. నీ వెనుకున్న కథేందో గూగుల్‌లో వెతుకుతున్నరు. ఈ అడవి తల్లికి పుట్టి, ఈ భూతల్లి పాలు తాగి, ఇక్కడి సెట్టూసేమా, నీటి బొట్టు కోసం నువ్వు జేసిన 'జల్ జంగల్ జమీన్..' జంగ్‌ను యాది జేసుకుంటున్నరు. అడవి జోలికొస్తే, అన్నెంపున్నెం ఎరుగని ఆదివాసుల మీదికొచ్చిన ఆంగ్లేయ, నైజాం సేనలతో ఎంతటి పోరుజేసినవో చదువుతున్నరు. కారడువుల్లో కాల్మొక్తా బాంచేననే రోజులు పోయినాయంటూ.. కొర్రాసు నెగడోలే మండిన నీ గాథను చర్చిస్తున్నరు. భీమా.. ఇదంతా ఎందుకో తెలుసా..!? నీ పేరు పెట్టి తీసిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు ఆస్కార్ అవార్డు వచ్చినందుకే. అందులో తెల్లోడిని ఇరగదీసేలా.. ప్రతీ భారతీయుడు గర్వపడేలా రాసిన 'నాటు.. నాటు..' పాటను ప్రపంచం మెచ్చింది. హాలీవుడ్‌లోని డాల్బీ థియేటర్ వేదిక ఆ సినిమా కథపై, అందులో భీమా..! నీ వీరోచిత గాథపై విశ్వవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఈ గడ్డపై నీవు పుట్టినందుకు ఆదివాసుల ఖిల్లా.. అడవుల జిల్లా అయిన ఉమ్మడి ఆదిలాబాద్ మురుస్తోంది.

ఆస్కార్ అవార్డు రాకతో..

ఎక్కడ ఆదిలాబాద్ జిల్లా.. ఎక్కడ ఆస్కార్ వేదిక దానికి దీనికి సంబంధమేమిటి? అంటే పక్కాగా ఉందనే చెబుతాం. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ట్రిపుల్‌ఆర్(ఆర్‌ఆర్‌ఆర్) సినిమాలో ఒక పాత్ర మన్నెం వీరుడు అల్లూరి సీతారామారాజుదైతే.. మరో వీరోచిత పాత్ర మన అడవి తల్లి కన్న ఆదివాసీ బిడ్డ కుమురం భీముడిది. నిజ జీవిత చరిత్రకు కాసింత సినీకథను జోడించి తన పాత్రను తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అప్పటి నుంచే దేశవ్యాప్తంగా కుమురం భీముడి చరిత్రను లోతుగా ఆరాతీయడం మొదలైంది. తాజాగా ఆ సినిమాలోని 'నాటు.. నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో ఆ సినిమా, అందులోని పాత్రలపైనా ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రధానంగా మారుమూల అటవీ ప్రాంతంలో, ఎలాంటి అధునాతన ఆయుధాలు లేకుండా జల్ జంగల్ జమీన్ నినాదంతో భీమ్ సాగించిన పోరు అందరినీ ఆకట్టుకుంటోంది.

వీరుడిగా ఎదిగిన పోరుబిడ్డ..

అందరిలాగే సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టిన భీమ్ స్థానిక పాలకుల ఆకృత్యాలను సహించేవాడు కాదు. అడవుల్లోకి చొచ్చుకొస్తున్న ఆంగ్లేయులపై నిర్మల్‌గడ్డ మీద వీరోచిత పోరు సాగించి వీర మరణం పొందిన రాంజీగోండు సహా వెయ్యిమంది అమరుల గాథతో స్ఫూర్తి పొందాడు. రాంజీ చూపిన పోరుబాటను ఎంచుకుని తాము నమ్ముకున్న అడవులు, అన్యాయాన్ని సహించని ఆదివాసీ యువతను అండగా చేసుకుని నిజాం సైన్యంపై పోరాటం చేశాడు. ఇక్కడి నీళ్లు, అడవులు, భూములు తమవే అని ప్రకటించాడు. అలా.. తను నమ్మిన పోరులోనే నమ్మకద్రోహంతో అమరుడయ్యాడు. కానీ.. ముందుతరాలకు తరిగిపోని పోరాటస్ఫూర్తిని నింపాడు.

ఆదివాసుల్లో ఆనందం..

సిర్పూరు(యూ) మండలం పెద్దదోబ గూడెంలో ఉంటున్న కుమురం భీమ్ వారసులు సైతం చాలా సంతోషం వ్యక్తంచేస్తున్నారు. భీమ్ కోడలు భాగుబాయి, మనుమలు కుమురం సోనేరావు, కుమురం భీమ్ వారి కుటుంబసభ్యులతోపాటు ఆదివాసీ గూడేలన్నీ సంబరాల్లో మునిగిపోయాయి. తాము దేవుడిగా భావించే భీముడి పేరిట తీసిన సినిమాలోని పాటకు విశ్వవేదికపై అవార్డు రావడం, ప్రపంచవ్యాప్తంగా భీమ్ పాత్రను చర్చించుకోవడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా తీరని వెతలు..

రాంజీగోండు, కుమురం భీమ్.. ఇలా ఎంతోమంది ఆదివాసీ వీరులు పోరాటాలు చేసినా ఇప్పటికీ అడవి బిడ్డల బతుకుల్లో పూర్తి వెలుగులు నిండలేదు. అడవినే నమ్ముకుని బతుకుతున్న ఆ గూడేల్లో సరైన సౌకర్యాలు, వసతులూ లేవు. ఇంకా.. కరెంటు చూడని బిడ్డలున్నారు. ఇప్పటికీ తారురోడ్డెక్కని గ్రామాలున్నాయి. తాగునీటికి చెలిమలే దిక్కవుతున్నాయి. ఆపదొచ్చినా, అనారోగ్యమైనా.. కోసుల దూరంలోని ఆస్పత్రికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితే. 'ఆస్కార్' వేదికగా యావత్ ప్రపంచం కుమురం భీముడిని తలుస్తున్నందుకు సంబురపడుతూనే.. 'ఓ.. ప్రజాప్రతినిధులారా, నేతలారా, అధికారులారా, సంఘసేవకులారా.. సినిమావాళ్లారా..! ఎవరైనా సరే.. ఒక్కసారి మాదిక్కు చూడండి. ఒక్కసారి మా గూడేలకు రండి. మా గోసలు తీర్చండి' అంటూ ఆదివాసీ గూడేలు గోడు వెల్లబోసుకుంటున్నాయి.

ఆసిఫాబాద్‌కు వచ్చిన రాజమౌళి

కుమురంభీం యోధుడిని తన సినిమాలో ప్రధాన పాత్రగా తీసుకున్న దర్శకుడు రాజమౌళి గతేడు ఏప్రిల్‌లో ఆసిఫాబాద్‌కు వచ్చారు. భీంకు నివాళ్లు అర్పించారు. ఆయన పోరాట చరిత్రను తెలుసుకున్నారు. అప్పటి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కుమురంభీం మనవడు సోనే రావుతోనూ సమావేశం అయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో నడుస్తున్న బెలూన్ థియేటర్‌ను సందర్శించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా స్థానికులతో కలసి చూసి సంతోషం వ్యక్తం చేశారు.

మా దేవుడు..



మా మామ కుమురం భీముడంటే మాకు దేవుడి లెక్క. మావోళ్ల పడుతున్న కష్టాలను తట్టుకోలేక పోరాటం జేసిండు. ఆయన కొడుకు మాధవరావునే నేను పెండ్లిజేస్కున్న. ఈ ఇంటి కోడలైనందుకు గర్వపడుతున్న. నా చిన్న కొడుకుకు మా మామ భీమ్ పేరే పెట్టినం.

– కుమురం భాగుబాయి, భీమ్ కోడలు

సంతోషంగా ఉంది..



అడవిలో పుట్టి.. అడవినే తల్లిగా నమ్మినోళ్లం. ఈ అడవి తల్లితోపాటు ఈ భూమి, ఇక్కడి నీళ్ల మనవేనంటూ మా తాత కుమురం భీమ్ చేసిన పోరాటం ఎప్పటికీ యాదిమర్వం. మా ఆదివాసీ వీరుడి పేరు మీద తీసిన సినిమా పాటకు అవార్డు రావడం సంతోషంగా ఉంది. రాజమౌళి సారును యాదిజేస్కుంటం.

– కుమురం సోనేరావు, భీమ్ మనుమడు

ఇక్కడి ప్రాంతాలన్నీ చూడాలి..



రాజమౌళి సార్ దర్శకత్వంలోని 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని 'నాటు.. నాటు..' పాటకు ఆస్కార్ రావడం, అందులో మా ముత్తాత కుమురం భీమ్ పాత్ర ఉండటం మాకు గర్వకారణం. సినిమా గురించే కాకుండా ఇక్కడి మా ప్రాంతాలను అందరూ చూడాలి. మా ఆదివాసులు పడుతున్న కష్టాలపై స్పందించాలి.

– కుమురం వనిత, భీమ్ మునిమనుమరాలు

పోస్టులన్నీ ఖాళీ..!

- మంచిర్యాల మున్సిపాల్టీలో ఇన్‌చార్జీల పాలన
- మందమర్రి కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- టౌన్‌ప్లానింగ్‌లో టీపీవో పోస్టు ఒక్కటే..



మంచిర్యాల మున్సిపాలిటీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాల గ్రేడ్ –1 మున్సిపాల్టీలో ఇన్‌చార్జీల పాలన సాగుతోంది. కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. గత కమిషనర్‌పై గత నెలలో పోలీసు కేసు నమోదై రిమాండ్‌కు తరలించడంతో మున్సిపల్ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. అదే నెల 13న మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజుకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రెండు మున్సిపాల్టీలకు ఆయన కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. మేనేజర్ పోస్టు సైతం ఖాళీగా ఉండడంతో పెద్దపల్లి మున్సిపల్ మేనేజర్‌ను డిప్యూటేషన్‌పై మంచిర్యాలకు పంపించారు. ఎంతో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక్క టౌన్‌ప్లానింగ్ అధికారి మినహా మిగతా పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. ఇంజినీరింగ్ విభాగంలోనూ డిప్యూటీ ఇంజనీర్‌తోపాటు ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడం, మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించడంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. జిల్లా కేంద్రం కావడం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తకాలనీలు ఏర్పడుతుండడంతో సిబ్బంది కొరత ప్రభావం మున్సిపాలిటీపై పడుతోంది.

సగానికి పైగా..

మంచిర్యాల మున్సిపాల్టీ 1956లో ఏర్పడగా, 2004లో గ్రేడ్–1 స్థాయికి అప్‌గ్రేడ్ అయింది. స్థాయి పెరిగినా అధికారులు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. కోట్లాది రూపాయలు నిధులు మంజూరవుతున్నా, పన్నుల రూపంలో ఏటా రూ.16.12 కోట్లు వసూలు అవుతున్నా అభివృద్ధి ముందుకు సాగడం లేదు. కీలకమైన కమిషనర్, మేనేజర్, ఇంజినీరింగ్‌శాఖ, టౌన్ ప్లానింగ్ శాఖ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. మున్సపాల్టీలో అన్ని రకాల పోస్టులు 211 ఉండాల్సి ఉండగా 95మంది మాత్రమే పని చేస్తుండగా 116 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇందులో ముఖ్యమైన సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు రెండు ఉండాల్సి ఉండగా ఒకరిని నియమించగా, గత రెండేళ్లుగా మందమర్రి బల్దియాలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. దీంతో రెండు పోస్టులూ ఖాళీగా ఉండడంతో హెల్త్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు ఏఈ లకు ఒకరు పని చేస్తుండగా, డీఈ పోస్టు ఖాళీగా ఉంది.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో..

టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీపీబీవో) పోస్టులు నాలుగూ ఖాళీగా ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) రెండు పోస్టులు ఉండగా, ఒకరిని రామగుండంకు డిప్యూటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఉన్న ఈ ఇద్దరికి టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించడంతో ఈ రెండు పోస్టులూ ఖాళీ ఏర్పడ్డాయి. టౌన్‌ప్లానింగ్ ట్రేసర్ రెండు పోస్టులు, టౌన్ సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఈ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఒక్కరే పని చేస్తున్నారు. ఏటా రూ.55 కోట్ల నుంచిరూ.60 కోట్ల నిధులు, వాటి ఖర్చులకు సంబంధించిన లెక్కలు చూసేందుకు ఉండాల్సిన అకౌంటింగ్ విభాగంలోనూ ఖాళీలు ఉన్నాయి. ఇందులో సీనియర్ అకౌంటెంట్ 1, జూనియర్ అకౌంటెంట్ 2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న జేఏవో పోస్టు కూడా భూపాలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న వారికి డిప్యూటేషన్ ఇచ్చారు. వారంలో రెండు రోజులు మాత్రమే ఇక్కడ జేఏవో పని చేస్తున్నారు. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను వసూలుకు ఐదుగురు బిల్ కలెక్టర్లు పనిచేయాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. దీంతో పన్ను వసూలుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. మార్చి 31 వరకు వంద శాతం పన్ను వసూలు చేయాల్సి ఉన్నా, ఇప్పటికీ 52 శాతం మాత్రమే వసూలు చేశారు.

అభివృద్ధికి ఆటంకం

బల్దియాలో ఏటా రూ.30 కోట్లకు పైగా నిధులు అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నారు. జిల్లా కేంద్రం కావడం, పట్టణ సుందరీకరణతోపాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, పార్కుల ఏర్పాటు, వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం వంటివి ప్రతీ రోజు చేయాల్సిన పనులు, కీలక పోస్టులు ఖాళీలతో అనుకున్న సమయానికి అందించలేని పరిస్థితి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలో వందలాది ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇంటి అనుమతులు, దానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా, అక్రమ నిర్మాణాల అరికట్టడం వంటివి టౌన్‌ప్లానింగ్ విభాగం చేయాల్సి ఉన్నా, ఒక్క టీపీవో పోస్టు మినహా, పోస్టులన్నీ ఖాళీతో పట్టణంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ భూములు, అక్రమ లేఔట్లు, వాగులు, చెరువు శిఖం భూములను కబ్జా చేస్తున్నా, రోడ్లను ఆక్రమిస్తున్నా చర్యలు తీసుకోలేని పరిస్థితి మున్సిపాలిటీది. గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో కీలక పోస్టులను భర్తీ చేస్తేనే ఈ ప్రాంత అభివృద్ధితోపాటు ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలకు అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీలో కీలక పోస్టులు ఖాళీగా ఉండడం ప్రగతిపై ప్రభావం చూపుతున్నాయి.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు కేంద్రంలోకి అనుమతి ఉండదని, ప్రతీ విద్యార్థి సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి జిల్లా అధికారులతో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 8.30గంటల నుంచి లోపలికి అనుమతిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు 7780129509 నంబర్‌లో సంప్రదించవచ్చని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి జిరాక్స్ సెంటర్లు మూసి వేస్తామని తెలిపారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించాలని సూచించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇంటర్మీడియెట్ పరీక్ష ల నిర్వహణపై సమీక్షా నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వే ణు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజ, వైద్యశాఖ అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి
- సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నంబర్లు
- జిల్లాలో హెల్ప్‌లైన్ నెంబర్లు..
  7780128509, 8328612124


మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 24 పరక్షీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం 6,910 మంది, ద్వితీయ సంవత్సరం 7,758 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తికి గురవకుండా, సమస్యల పరిష్కారానికి జిల్లాలో హెల్ప్‌లైన్ నంబర్లు, మానసిక వైద్యనిపుణులను అందుబాటులోకి తెచ్చారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సలహాలు, సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్లతోపాటు పలు విషయాలను మంచిర్యాల డీఐఈవో శైలజ వివరించారు. ప్రతీ విద్యార్థి ఒత్తిడి వదిలి పరీక్షలు రావాలయని, తోటి విద్యార్థులతో పోల్చుకుని చదవొద్దని, పరీక్షల సమయంలో ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ప్రశాంతత కోసం నిత్యం యోగ సాధన చేయాలని, రాత్రివేళల్లో ఎక్కువ సేపు చదివి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తెలిపారు. విద్యార్థుల సందేహాలు, సలహాలకు హెల్ప్‌లైన్ నంబరు 040–24601010, 040–2465 5025, జిల్లా హెల్ప్‌లైన్ నంబర్లు 77801 29509, 83286 12124లో సంప్రదించాలని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడికి గురైతే మానసిక వైద్యనిపుణులను 14416 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్

ఫీజుల పేరిట ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు హాల్‌టికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తుంటారు. పరీక్షలు సమీపిస్తున్నా కళాశాలల చుట్టూ తిప్పించుకుంటారు. కళాశాల యాజమాన్యంతో సంబంధం లేకుండా విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షలు రాయవచ్చు. హాల్‌టికెట్ల విషయంలో కళాశాలలు ఇబ్బందులకు గురి చేస్తే హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించే అవకాశం కల్పించినట్లు డీఐఈవో తెలిపారు.

డబ్బులు అడిగితే కేసులు పెట్టిస్తా


- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: ప్రభుత్వ పథకాలు దళితబంధు, గృహలక్ష్మిలో ఎవరైనా డబ్బులు అడిగినా, ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని, అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎవరైనా చేతివాటం ప్రదర్శించి వారిపై కేసులు పెట్టిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం దళితబంధు, ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం అమలు చేస్తోందని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక గ్రామంలోనే నిర్వహిస్తామని, అర్హులకే ఇళ్లు కేటాయిస్తామని అన్నారు. చెరువుల కబ్జాను తీవ్రంగా పరిగణిస్తామని, పొనకల్ చెరువు కబ్జాపై ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించానని చెప్పారు. సింగరాయిపేట్, కిష్టాపూర్ చెరువుల కబ్జాపై విచారణ, అన్ని చెరువులకు హద్దులు గుర్తించి బౌండరీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసినా, ఆక్రమించినా ఊరుకునేది లేదని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, డైరెక్టర్లు భరత్‌కుమార్, నర్సగౌడ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఉప సర్పంచ్ రవి, నాయకులు శ్రీనివాసరెడ్డి, నాయక్ పాల్గొన్నారు.

ఇద్దరు టీపీఎస్‌లకు పదోన్నతి






ఎస్.యశ్వంత్‌కుమార్   కె.శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో టీపీఎస్‌లుగా పనిచేస్తున్న ఇద్దరికి టౌన్ ప్లానింగ్ అధికారులుగా పదోన్నతి కల్పించారు. ఎస్.యశ్వంత్‌కుమార్ మంచిర్యాలలో టీపీఎస్‌గా ఉండగా, రామగుండం, చెన్నూరులో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. టీపీవోగా పదోన్నతి కల్పిస్తూ కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. టీపీఎస్‌గా మంచిర్యాలలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌కు టీపీవోగా పదోన్నతి కల్పించి జగిత్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

రేచినీలో వేబ్రిడ్జి నిర్మాణానికి రూ.58లక్షలు



సమావేశంలో ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు

బెల్లంపల్లి: తాండూర్ మండలం రేచినీ గ్రామంలోని గోదాం ఆవరణలో అంతర్గత రోడ్లు, ధాన్యం తూకానికి వేబ్రిడ్జి నిర్మాణానికి రూ.58లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా తెలిపారు. సోమవారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్ యార్డులు, ఆహార ఉత్పత్తుల క్రయవిక్రయాలు ఇతరత్రా రైతాంగ సమస్యలపై చర్చించారు. వేమనపల్లి, కాసిపేట మండలాల్లో నిర్మించిన గోదాముల్లో రోడ్లు, వేబ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. పంటలు అత్యధికంగా సాగు చేస్తు న్న గ్రామాల్లో ధాన్యం ఆరబోత కోసం ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలని, ఇందు కోసం నిధులు మంజూరు చేయాలని తీర్మానం చేశారు. బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జీ కార్యదర్శి భాస్కర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితులపై దాడులను నివారించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను నివారించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. ఈ నెల 31న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, నాయకులు మారపెల్లి రవి, కామెర దుర్గారాజ్, కోడి వెంకటేశం, నర్సింగరావు, జాడిపోచం, మొగిలి లక్ష్మణ్, కుర్ర అంజి, తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి కేసులో నిందితులను శిక్షించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమారం(చెన్నూర్): కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థి ప్రీతి మృతి కేసులో నిందితులను శిక్షించాలని కోరుతూ లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీనివాస్ నాయక్ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, కేసుపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సారయ్య నాయక్ ఉన్నారు.

శైలజకు నాట్యరత్న అవార్డు



శైలజను అభినందిస్తున్న గద్దర్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణానికి చెందిన నృత్య దర్శకురాలు వడ్డాది శైలజ జాతీయస్థాయి నాట్యరత్న అవార్డుకు ఎంపికైంది. ఆదివారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా 6వ జాతీయ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, గద్దర్ చేతుల మీదుగా శైలజ అవార్డు అందుకున్నారు.

ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి(మంచిర్యాల): మండల కేంద్రంలోని కొందరు కిరాణ వ్యాపారులు రోడ్డు పక్కనే పూజా సామాగ్రితో పాటు మద్యాన్ని ప్రదర్శనగా పెట్టి విక్రయించడంపై సోమవారం ‘సాక్షి’లో ‘మందు బాబు..మందు’ కథనం ప్రచురించింది. కథనానికి స్పందించిన లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ బాబా సిబ్బందితో కలిసి దండేపల్లి బస్టాండు ప్రాంతంలోని పలు కిరాణ దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ఫ్లడ్ కాలనీకి చెందిన జి.శ్రీనివాస్, కే.లక్ష్మి సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. నస్పూర్ శివారు సర్వే నంబరు 64 లో సుమారు 25 గుంటల భూమిని తుమికి మహేందర్‌రాజు తమ భూమిగా చెప్పుకుంటూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రెడిమేడ్ కంపౌండ్ వాల్ నిర్మించి అందులో కొన్ని షెడ్లు ఏర్పాటు చేశాడన్నారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు.

‘గిరి వికాస్’కు అటవీశాఖ అడ్డు!



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఎంపీపీ

గిరి వికాసానికి అటవీశాఖ అధికారులు అడ్డుగా నిలుస్తున్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో ప్రభుత్వమే గిరి వికాసం పేరుతో బోర్లు వేయించి వ్యవసాయాన్ని మరింత సుస్థిరం చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అటవీ అధికారుల జోక్యంతో కోటపల్లి మండలంలో నిరుపేద గిరిజనులు పథకానికి దూరమవుతున్నారు.

- బోర్లు వేయకుండా అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న గిరిజనులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీపీ మంత్రి సురేఖ

కోటపల్లి(చెన్నూర్): గిరి వికాస్ పథకంలో భాగంగా జిల్లాకు 41 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో కోటపల్లి మండలంలోని ఆలుగామ, ఎడగట్ల గ్రామాలకు 7 యూనిట్లు మంజూరు కాగా సుమారు 84 ఎకరాల్లో 40 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో మిగతా చోట్ల గిరిజనుల భూముల్లో గిరి వికాస్ పేరిట బోర్లు వేస్తుండగా కోటపల్లి మండలంలో మాత్రం అటవీశాఖ అధికారులు ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. తమ అనుమతి లేనిదే బోర్లు వేయకూడదని అడ్డు తగులుతున్నారని నిరుపేద గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వేసే బోర్లతో తమ పంటలు పండించుకోవచ్చనే ఆశతో ఉన్నామని, కానీ అటవీశాఖ అధికారులు బోర్లు వేయకుండా అడ్డుతగులుతుండడంతో తాము నష్టపోయే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

దేవుడు వరమిచ్చినా...

‘దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు’ అన్న చందంగా మారింది కోటపల్లి గిరిజనుల పరిస్థితి. గిరి వికాసం పథకంతో లబ్ధిదారుల ఎంపికలో కలెక్టర్ చైర్మన్‌గా ఐటీడీఏ పీవో కన్వీనర్‌గా, డీఆర్‌డీవో, డీఏవో, డీహెచ్ఓ, గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, జిల్లా అటవీశాఖ అధికారుల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగినా అటవీశాఖ అధికారులు మాత్రం ఇవేం తమకు తెలియవని, తాము చెప్పిందే వినాలని భీష్మించుకు కూర్చుంటున్నారు. లబ్ధిదారుల ఎంపికనే జిల్లా కమిటీ ఫైనల్ చేసినప్పటికీ అటవీశాఖ అధికారులు బోర్లు వేయకుండా అడ్డుకోవడం ఏమిటని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ కమిటీలో కలెక్టర్, ఐటీడీఏ పీవోతో పాటు మెంబర్‌గా అటవీశాఖ జిల్లా అధికారి సంతకం ఉన్నా అటవీశాఖ అధికారులు బోర్లు వేసుకోకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. ఇదే విషయంపై కోటపల్లి అటవీశాఖ రేంజర్ రవిని వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు తెలిపారు.

అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లు వేయకుండా కోటపల్లి అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, నిరుపేద గిరిజనుల భూముల్లో బోర్లు వేసుకునేలా అనుమతి ఇచ్చి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎంపీపీ మంత్రి సురేఖ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పథకంలో భాగంగా సుమారు 40 మంది లబ్ధిదారులు 80 ఎకరాల్లో తమ పంటలను సాగు చేసుకోవడానికి ప్రభుత్వం, జిల్లా అధికారులు అనుమతినిచ్చినా కోటపల్లి ఫారెస్టు అధికారులు అడ్డుకోవడంతో గిరిజనుల అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి నిరుపేద గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను కూల్చివేయాలి

- లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో
- అధికారుల స్పష్టమైన హామీతో ఆందోళన విరమణ



రాస్తారోకో చేపడుతున్న ఆందోళనకారులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈఎస్ఐ మలుపు వద్ద అటవీశాఖ కార్యాలయానికి వెళ్లే దారిని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం మూసి వేయడాన్ని నిరసిస్తూ సోమవారం కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అధ్యక్షులు వెన్న కిషోర్ బాబు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు కౌన్సిలర్లు, ప్రజలు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పేపర్ మిల్లు ప్రారంభం నుంచి ఈరోడ్డును ప్రజలు వినియోగిస్తున్నారని, జేకే పేపర్ మిల్లు యాజమాన్యం వచ్చిన తర్వాత అన్ని దారులను మూసివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో రూ.32 లక్షల నిధులతో నూతన రోడ్డు నిర్మాణం సైతం చేసినట్లు వారు వెల్లడించారు. అయినప్పటికీ యాజమాన్యం ఫారెస్ట్ ఆఫీస్ లైన్ రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించిందన్నారు. రోడ్డును తామే కూల్చివేస్తామని ముందుకు సాగడంతో పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సీఐ బుద్దే స్వామి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులను సముదాయించారు. అయినా వినకుండా వెన్న కిషోర్ బాబు తన చావుకు యాజమాన్యం తీరే కారణమని ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించారు. పోలీసులకు, అతనికి మధ్య జరిగిన తోపులాటలో పెట్రోల్ నేలపై పడి పోయింది. గుర్తు తెలియని వ్యక్తులు అగ్గిపుల్ల వేయడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో మంటలు చేలరేగాయి. వార్డు కౌన్సిలర్ సంగీతతో పాటు పలువురు కౌన్సిలర్లు అక్కడికి చేరుకుని అడ్డుగోడను సత్వరమే తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు, సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ కుమార్ వారికి మద్దతు ప్రకటించారు. 10 నుంచి 15 రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ మేనేజర్ బాపు, డీఎస్పీ కరుణాకర్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

అడ్డుగోడపై ఫెన్సింగ్ ఏర్పాటుకు సన్నాహాలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ మూలమలుపు వద్ద ఫారెస్ట్ ఆఫీస్‌కు వెళ్లే లైన్‌లో ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు మిల్లు యాజమాన్యం నిర్మించిన అడ్డుగోడను తొలగించాలని సోమవారం ఉదయం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, రాస్తారోకో నిర్వహించారు. అయితే సాయంత్రం వరకు మిల్లు యాజమాన్యం అడ్డుగోడపై ఫెన్సింగ్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. ఈఎస్ఐ మలుపు వద్ద ఉన్న అడ్డుగోడపై ఫెన్సింగ్ ఏర్పాటుకు పలువురు కార్మికులు సిమెంట్‌తో క్లిప్‌లు బిగించారు. ఫారెస్ట్ ఆఫీస్‌కు వెళ్లే దారికి అడ్డంగా కట్టిన గోడను తొలగించాలని ఉదయం ఆందోళన జరగడం.. సాయంత్రం గోడపై కంచె ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



బారేవాడలో మృతి చెందిన ఎద్దు

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండల కేంద్రంలోని బారేవాడలో సోమవారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. కన్నెపల్లికి చెందిన నికాడి శ్రీనుకు చెందిన ఎద్దు బారేవాడలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్యాధికారి కార్యాలయంలోని మలేరియా విభాగంకు సంబంధించిన గదిలో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. అందులో ఉన్న దోమ తెరలు, యాంటి మలేరియా కెమికల్స్, దోమల నివారణకు వినియోగించే రసాయనాలు, స్ప్రే చేసే మందులు దగ్ధమయ్యాయి. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. గతేడాది డిసెంబర్ 10న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో గల డీడీఎంహెచ్‌వో కార్యాలయంలో నిల్వ ఉంచిన వ్యాక్సిన్ల గదిలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్రిజ్‌లు, వ్యాక్సిన్లు పూర్తిగా కాలిపోయాయి. మూడు నెలల్లోనే రెండు విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుని లక్షల విలువజేసే మందులు, వ్యాక్సిన్లు, ఫ్రిజ్‌లు, సామగ్రి ఆహుతి కావడం ఆందోళన కలిగిస్తోంది.

‘తొలిమెట్టు’ బలోపేతానికి పాఠ్యప్రణాళికలు



మాట్లాడుతున్న సంస్థ ఆర్గనైజర్ రాంబాబు

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర విద్యాశాఖ చేపడుతున్న తొలిమెట్టు కార్యక్రమం మరింత బలోపేతం అయ్యేందుకు 2023-24, 2024-25 విద్యాసంవత్సరానికిగానూ పాఠ్యప్రణాళికలు, అభ్యాస పుస్తకాలు రూపొందించడం జరుగుతోందని రూంటురీడ్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ రాంబాబు తెలిపారు. సోమవారం జిల్లా సైన్స్ కేంద్రంలో ఎంఈవో, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్లు, కాంప్లెక్స్ హెచ్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 485 ప్రాథమిక, 94 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 ,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు భాష పాఠ్యప్రణాళికలు, విద్యార్థులకు అభ్యాస పుస్తకాలు అందిస్తామన్నారు. 1 నుంచి 5వతరగతి విద్యార్థుల్లో పఠనాశక్తికి కథలు అందించనున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో రూంటురీడ్ కార్యక్రమాలు అమలు, పఠనాశక్తి పెంపొందించే పలు అంశాలపై సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, సఫ్దర్‌అలీఖాన్ వివరించారు. కార్యక్రమంలో సెక్టోరల్-3 అధికారి పద్మజా, ఎంఈవో, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’తో ఉచితవైద్యం



నమోదు పత్రం అందిస్తున్న రఘునాథ్

దండేపల్లి(మంచిర్యాల): ఆయుష్మాన్ భారత్‌తో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. మండలంలోని చింతపల్లిలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్, ఉచిత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కింద తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ.5లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ విలీనం కావడంతో కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.3 లక్షలు అందిస్తుందన్నారు. అనంతరం 400 మందికి ఆయుష్మాన్ భారత్ నమోదు పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, అనిల్, వంశీ, అశోక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



సెడ్మారావు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): ఈ నెల 7న రోడ్డు ప్రమాదానికి గురైన కుమురం సెడ్మారావు (23) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని కెస్లాగూడకు చెందిన సెడ్మారావు ఈ నెల 7న హోలి పర్వదినం సందర్భంగా కొట్నాక కిరణ్ కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జైనూర్ మండలం అడ్డేసర గ్రామానికి వెళ్లి వస్తుండగా దేవాపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ముందుగా కెరమెరికి, అక్కడినుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, ఆతర్వాత హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కాగా కిరణ్ కుమార్ మంచిర్యాలలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దత్తాత్రేయకు జ్యోతిష్య విశారద అవార్డు



దత్తాత్రేయ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన తాడూరి దత్తాత్రేయ ఆచార్య జ్యోతిష్య విశారద అవార్డుకు ఎంపికయ్యారు. విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్టు మూడేళ్లుగా ఉగాదిని పురస్కరించుకుని సనాతన హైందవ సంస్కృతి సంప్రదాయాలను విస్తరింపజేస్తున్న వారికి ఈ పురస్కారం అందజేస్తోంది. గుంటూరు జిల్లా చుట్టగుంటలో పోలేరమ్మ దేవాలయం వద్ద ఈ నెల 19న ఈ అవార్డును అందుకోనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు హెచ్ఎంఎస్ అనుబంధ కార్మికసంఘం నూతన కమిటీని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఎర్లీ సెక్రటరీగా విక్రమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రదీప్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎలుక రమేశ్, సెక్రటరీలుగా తాటిపర్తి సాయికృష్ణ, రామగిరి మల్లేశ్, ట్రెజరీగా వెన్నంపల్లి వెంకటరమణలను ఎన్నుకున్నారు.

ఆర్కే 7లో మ్యాన్‌రైడింగ్ పునఃప్రారంభం



మ్యాన్‌రైడింగ్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే 7 గనిలో చైర్‌కార్ మ్యాన్‌రైడింగ్ సిస్టంకు మరమ్మతులు పూర్తికావడంతో సోమవారం పునఃప్రారంభించారు. కార్యక్రమానికి శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, ఈఅండ్‌ఎం జీఎం సూర్యకుమార్ హాజరయ్యారు. ఆరునెలల క్రితం సాంకేతిక కారణాలతో మ్యాన్‌రైడింగ్ యంత్రం నిలిచిపోయిందని, పూర్తిస్థాయి మరమ్మతుల అనంతరం పునఃప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రమేశ్‌బాబు, ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ సెక్రెటరీ మెండె వెంకటి, నాయకులు అశోక్, వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, తొంగల రమేశ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దాలి



అవగాహన కల్పిస్తున్న డీజీఎం సతీశ్‌బాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): సంస్థలో పనిచేస్తున్న ప్రతీఉద్యోగి రక్షణ సూత్రాలు తూచా తప్పకుండా పాటిస్తూ సింగరేణిని ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా డీజీఎం సివిల్ సతీశ్ బాబు అన్నారు. ఏరియాలోని గోలేటి, మాదారం సివిల్ కార్యాలయాలతో పాటు గోలేటి సీహెచ్‌పీ వద్ద సోమవారం రక్షణ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించి రక్షణ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణం అవుతాయన్నారు. రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణ పరికరాలను సక్రమంగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్లు రాజయ్య, శ్రీనివాస్, శ్రావణ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం



ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుతో సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన 37వ సబ్ జూనియర్ బాలుర రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. 12న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుతో హోరాహోరీగా జరిగిన పోరులో రెండు గోల్స్ తేడాతో ఓడి ద్వితీయ స్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు క్రీడాకారులు ఆదివారం రాత్రి మంచిర్యాలకు చేరుకోవడంతో అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, కోచ్‌లు సునార్కర్ అరవింద్, దుర్గం రాజలింగు, సీనియర్ క్రీడాకారులు వెంకటేశ్, ప్రవీణ్, శృతి, వర్ష పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన సీవోఈ విద్యార్థి

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. ఈనెల 10, 12 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన 33వ బాలుర సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరుపున ఆడిన డి.ఇషాంత్ కీలకంగా వ్యవహరించి విజయానికి తోడ్పడ్డాడు. సదరు విద్యార్థిని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న చిన్నయ్య

భీమారం(చెన్నూర్): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి చిన్నయ్య సోమవారం తనిఖీ చేశారు. పోతన్‌పల్లి, ఆర్కెపల్లి, భీమారం అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో సమయపాలన పాటించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని టీచర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



శ్రీలత (ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూర్‌లో చోటు చేసుకుంది. కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన దర్వాజల లచ్చన్న, భాగ్య దంపతుల కుమార్తె శ్రీలత(25)కు తాండూర్‌కు చెందిన పెద్దబోయిన మహేందర్‌తో 2021లో వివాహమైంది. ఆదివారం ఉదయం అత్తగారింటి నుంచి వెళ్లిన శ్రీలత తాండూర్ పాత గోదాంల సమీపంలోని రైల్వేట్రాక్‌పై శవమై కనిపించింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. కాగా తన కూతుర్ని భర్త మహేందర్, అత్త గౌరక్క, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకు రావాలని, పిల్లలు కావడంలేదని మానసికంగా వేధించే వారని ఆరోపించారు. అత్తింటి వారే చంపి రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా మహిళకు నారీ శక్తి పురస్కారం



పురస్కారం అందిస్తున్న సభ్యులు

కౌటాల(సిర్పూర్): సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధిస్తున్న మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన మాదాసు సునందకు గ్రామభారతి నారీశక్తి పురస్కారం దక్కింది. ఆదివారం నల్గొండ జిల్లాలోని మర్రిగూడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారం ప్రదానం చేశారు. హైకోర్టు న్యాయమూర్తి పటోళ్ల మాధవిదేవి, గ్రామ భారతి గౌరవ అధ్యక్షుడు పాలాది మోహనయ్య, న్యాయమూర్తులు పి.రవీందర్, అజయ్, పాలిటెక్నిక్ చైర్మన్ స్తంభాద్రి రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

పాతమంచిర్యాల: హాస్టల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లకు ప్రతీనెల వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి, భాగ్య, ముత్తక్క, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.